క్లుప్తంగా

నేడు కేపీ మల్లవరంలో వైద్యశిబిరం

కోటనందూరు: మండలంలోని కేపీ మల్లవరం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ సోమవారం తెలిపారు. పాతకొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కాకడ సువర్ణప్రియాంక పర్యవేక్షణలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

గర్భిణులకు భోజనం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

రౌతులపూడి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) లో వైద్య పరీక్షల కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు ఎడ్ల బుజ్జి రమణమ్మ దంపతుల ఆర్థిక సాయంతో సోమవారం భోజనాలను సమకూర్చారు. మండలంలోని సుదూర ప్రాంతాల నుంచి వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు పోషకాహారం అందించేందుకు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా ప్రతినెలా దాతల సహకారంతో భోజన ఏర్పాటు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన ప్రసవానికి జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, ఆసుపత్రి వైద్యులు జానకి దేవి, సునీత, సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

4న కోటి బిల్వార్చన

తుని రూరల్: వచ్చేనెల నాలుగో తేదీన హరిహరపుత్ర అయ్యప్ప స్వామివారికి కోటి బిల్వార్చన, పడిపూజ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సోమవారం తెలిపారు. తుని మండలం వి.కొత్తూరు శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి బిల్వార్చన, పడిపూజ ప్రారంభమవుతుందన్నారు. కాకినాడకు చెందిన దండపాణి గురుస్వామి ఆశీస్సులతో అతని కుమారుడు వేలు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా శబరిమల ఆలయ పూజారి తాంత్రీ, పందళ రాజు వంశస్తులు, శబరిమల ఆలయ వాద్య కళాకారులు చండా మేళా, తిరువాభరణస్వామి పాల్గొంటున్నట్టు తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

తుని: పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. సోమవారం ప్రజా ఆరోగ్య అధికారులకు ప్లాస్టిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై పలు సూచనలు చేశారు. సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో పాటు మున్సిపల్ సిబ్బంది మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించి వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు గుడ్డతో తయారు చేసిన సంచులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారుల్లో మార్పు రాకపోతే జరిమానా విధించాలని ఆదేశించారు.

మార్కెట్‌లో షాపుల వేలం వద్దని ఆందోళన



గోకవరం సంత ప్రదేశంలో ఆందోళన నిర్వహిస్తున్న వ్యాపారస్తులు

గోకవరం: స్థానిక సంత మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న షాపులకు వేలం నిర్వహించొద్దని వ్యాపారస్తులు సోమవారం ఆందోళన నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న షెడ్ల స్థానంలో పంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. ఇటీవల వీటికి వేలం నిర్వహించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై వ్యాపారస్తులు సోమవారం సంత నిలిపివేసి ఆందోళన చేశారు. మార్కెట్‌లో షాపులను గతంలో వ్యాపారాలు నిర్వహించిన వారందరికీ కేటాయించాలని, గతంలో తాము షాపులు నిర్వహించిన స్థలంలోనే షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

తీరగ్రామాల్లో భవానీల సందడి

తొండంగి: విజయదశమిని పురస్కరించుకుని మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో భవానీల సందడి పెరిగింది. ఏటా విజయదశమికి ముందుగా 41 రోజులు, 27 రోజులు, 11 రోజులు, 9 రోజుల దీక్షలు చేపట్టడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో భవానీ దీక్షలు చేపట్టడంతో తీరగ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ముఖ్యంగా రామాలయాలు, దుర్గామాత ఆలయాలు, గ్రామదేవతల ఆలయాల్లో భవానీలు పీఠాలు ఏర్పాటు చేసుకుని నిత్యం ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. పడిపూజలు, భజనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ బాధ్యత

- ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి
- లింగంపర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ



లింగంపర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లింగంపర్తి గ్రామంలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించారన్నారు. ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రతి ఇంటి గడపనే ఆరోగ్యసమస్యలు క్షేత్రస్థాయిలో గుర్తించి ఒక్క రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. తొలుత ఆయన వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పి.నాయకంపల్లిలో..

గండేపల్లి: పి.నాయకంపల్లిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది సుమారు 430 మందికి పరీక్షలు చేశారు. అనంతరం గ్రామ జేసీఎస్ కన్వీనర్, పార్టీ నాయకులు మలిరెడ్డి పాపారావు, ఈటపీఆర్డీ మూర్తి, తదితరుల చేతుల మీదుగా వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లు అందజేశారు.

లోవకొత్తూరులో..

తుని రూరల్: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని లోవకొత్తూరు సర్పంచ్ లంక వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం లోవకొత్తూరులో తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.అన్వేషి పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొని అర్హులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఎస్సీ సెల్ నాయకులు లంక కృపానందం, గారా శ్రీనివాస రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కార్యదర్శి రాజబాబు పాల్గొన్నారు.

బలరామపురంలో..

రౌతులపూడి: బలరామపురంలో సోమవారం ఎంపీడీఓ ఎం.గోవిందు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి స్థానిక ప్రజాపతినిధులుతో కలిసి ప్రారంభించారు. శిబిరంలో 302 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి తాతాజి, సొసైటీ ప్రెసిడెంట్ సోమరౌతు భాస్వర బాబు, సాంబ, రమణ, తహసీల్దారు బి.బీమరావు, వైద్య బృందం పాల్గొన్నారు.



మందుల కిట్లు అందజేస్తున్న నాయకులు



లోవకొత్తూరులో సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ, వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ మేలు



కిర్లంపూడిలో రోగులకు వైద్య కిట్లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీలత, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురుకి వైద్య కిట్లలతో పాటు బాలింతలకు, గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేశారు. వైద్యులు రాంబాబు నాయక్, అభిషేక్, జె.మాధవ్, ఎం.గాయత్రి 510 వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మరో 17 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడాల రాంబాబు, రాపేటి ప్రసాద్, కురుమళ్ళ చిన్న, దాడి గోవిందు, సెక్రటరీ రమేష్‌బాబు, ఎస్‌ఎంలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: బురదకోట గిరిజన గ్రామంలో పెద్దిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు సాహితి, వై.గీతాసుధ, డి.అనూష, ఎ.సందీప్, ప్రసన్న కుమార్ 274 మందికి వైద్య సేవలు అందించి మందులను ఉచితంగా అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బలరామపురంలో వృద్ధులకు కిట్లు అందజేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు



బురదకోటలో సేలందిస్తున్న వైద్యులు

ఉత్సాహంగా ఎస్పీఎల్ ఎన్నిక



పాఠశాలలో ఎన్నిక నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం: కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నమూనా పాఠశాల విద్యార్థి ఎన్నిక ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులను ఓటు ద్వారా ఎస్పీఎల్‌ను ఎన్నుకోవడానికి ఈ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ ఎన్నికలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. హెచ్‌ఎం ఎస్.ఈశ్వరిదేవి మాట్లాడుతూ ప్రజాస్వామ్య భావనలు, ఎన్నికల వ్యవస్థ, నాయకత్వ లక్షణాలను విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎస్పీఎల్ ఎన్నికలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెదిరెడ్ల రాజు, పి.రాహుల్‌గాంధీ, జె.తాతారావు, సువర్ణరాజు, స్టాఫ్ సెక్రటరీ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై విచారణ



కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ

శంఖవరం: ఇటీవల కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని, దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ సోమవారం విచారణ చేపట్టారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులందరితో సమావేశమై సంఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మమేకమై పూర్తి విచారణ చేసి విద్యార్థుల్లో మనో ధైర్యం కల్పించి, విద్యలో బాగా రాణించాలని తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని, ప్రధానోపాధ్యాయులు శ్రీనువాస్, స్కూల్ చైర్మన్ వెలగ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ నేతకు నివాళి



పట్నాయక్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు, ధర్మవరం గ్రామాల్లో సోమవారం విప్లవ నేత నాగభూషణం పట్నాయక్ 25 వర్ధంతిని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం పట్నాయక్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ నాగభూషణ్ పట్నాయక్ విప్లవ ఉద్యమంలో ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. విప్లవ కమ్యూనిస్టు పార్టీల ఐక్యతకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో చిన్నం చంటి, చిన్నం సింహాచలం, పల్లా సరస్వతి, అనసూరి లక్ష్మి, చిన్నం కామరాజు పల్లా లక్ష్మి పాల్గొన్నారు.

చురుగ్గా ఆలయ పునర్నిర్మాణ పనులు



పునర్నిర్మిస్తున్న ఆలయం

తొండంగి: దానవాయిపేట సముద్రతీరంలో కామాక్షి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీర్ఘకాలం క్రితం సాగర తీరంలో కామాక్షి అమ్మవారి విగ్రహం సముద్రంలో లభించడంతో మత్స్యకారులంతా కలిసి దాతల సహకారంతో చిన్న ఆలయాన్ని నిర్మించి పూజలు నిర్వహించారు. ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దాతల సహకారంతో నూతన ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న ఆలయం ఆనుకుని వెనుక భాగంలో పెద్దగా నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆలయం పునాది నిర్మాణం పూర్తి చేసుకుని శ్లాబ్ దశకు చేరుకుంది. త్వరలో శ్లాబ్ పనులు పూర్తి చేసి ఆలయ గోపురం, ఇతర పనులు పూర్తి చేస్తామని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఇప్పటికే సాగర తీరాన సాయిబాబా, దుర్గామాత, వేంకటేశ్వరస్వామి, గ్రామదేవతల ఆలయాలు ఉండడంతోపాటు అమ్మవారి ఆలయం కూడా నిర్మాణం పూర్తికానుంది. ఈనేపథ్యంలో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే సాగర తీరానికి సీసీ రోడ్లు నిర్మించామని గ్రామ సర్పంచ్ మడదా తిరుమల కుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు మడదా హేమంత్ తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రాజరాజేశ్వరి

గోకవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సోమవారం గోకవరంలో మైత్రి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఖరీఫ్ 2023 ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని ఏర్పాటు చేయాలని మండల స్థాయి అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా ఏఓ రాజరాజేశ్వరి మాట్లాడుతూ గోకవరం మండలంలో రైస్ మిల్లులు లేనందున రైతు భరోసా కేంద్రాల్లోనే గోనె సంచులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్లుల దగ్గర ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ పద్మజ్యోతి, ఎస్సై శివనాగబాబు, డీటీ సునీత, సొసైటీ సీఈఓలు, బీఏఏలు, వీహెచ్ఏలు ఉన్నారు.

కోడిపందాలపై దాడి

ప్రత్తిపాడు: చినశంకర్లపూడి గ్రామ శివారులో కోడి పందాల శిబిరంపై సోమవారం రాత్రి ప్రత్తిపాడు పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో కోడి పందాలు ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు బైక్‌లు, రూ.5,840 నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

ఈ-క్రాప్ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి



రాజుపాలెంలో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ అమృత

కిర్లంపూడి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతుల నుంచి ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని మండల ఏఓ జోకా అమృత వీఏఏలను ఆదేశించారు. గ్రామాల్లో వీఏఏలు నిర్వహిస్తున్న పంట నమోదును సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 23 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 92 శాతం ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తిచేశామన్నారు. మిగిలిన 8 శాతం పూర్తి చేస్తున్నట్టు ఆమె తెలిపారు. రైతు భరోసా, పంట నష్టపరిహారం, ధాన్యం కనుగోలుకు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జోకా అమృత రైతులకు సూచించారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి



గాదెలపాలెంలో వరి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, ఏరువాక శాస్త్రవేత్తలు

గోకవరం: వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ రాజరాజేశ్వరి అన్నారు. గాదెలపాలెం గ్రామంలో ఎంటీయూ 1318 రకం వరిసాగును సోమవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి సందర్శించారు. సాగులో కేళీలను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ వారంలో శాస్త్రవేత్తల బృందం గోపాలపురం, గాదెలపాలెంలో పర్యటించి సాగును పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పీడీ యాక్ట్

రౌతులపూడి: గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన బల్లాడి అశోక్‌పై పీడీ యాక్ట్‌పై కేసు నమోదు చేసినట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్‌నబీ తెలిపారు. నిందితుడు అశోక్‌పై గతంలో గంజాయి అక్రమ రవాణా కేసులు నమోదవడంతో ఈ కేసు నమోదుచేశామన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారు పోలవరం కాలువ వద్ద సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై నాగార్జున రాజు తెలిపారు. సోమవారం పోలవరం కాలువ వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా మల్లిసాల నుంచి జగ్గంపేట వైపు మోటారుసైకిల్‌పై వస్తున్న జుత్తుక శివ, ప్రవీణ్ కుమార్‌లు ప్లాస్టిక్ కవర్లలో తరలిస్తున్న 50 లీటర్ల సారా లభించిందని తెలిపారు. సారాను, మోటారుసైకిల్ స్వాధీనం చేసుకుని ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై నాగార్జునరాజు తెలిపారు.

సారా ప్రవాహానికి అడ్డుకట్ట



ఉత్తరకంచిలో సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న కాకినాడ, ప్రత్తిపాడు ఎస్ఈబీ, పోలీస్ సిబ్బంది

- గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు
- ఎప్పటికప్పుడు అధికారుల దాడులు
- తగ్గుతున్న కేసులు
- ఈ ఏడాది 679 మంది అరెస్టు

ప్రత్తిపాడు: మద్యం, సారాకు బానిసలైన ప్రజలను ఆ మత్తు నుంచి దూరం చేసేందుకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. మద్యపాన నిషేధంలో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో బెల్ట్ షాపులను రద్దు చేసింది. పల్లెల్లో సారా వల్ల కలిగే నష్టాలపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ సారా తయారీ, విక్రయదారుల ఆటకట్టిస్తున్నారు. అయినా అధికారుల కళ్లుగప్పి గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు సాగిస్తూనే ఉన్నారు. ఓ పక్క స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్–ఎస్ఈబీ) పోలీసుల దాడులు చేసి అరెస్టులు చేస్తున్నా ఏదో మూల సారా తయారీ కొనసాగుతూనే ఉంది. అయితే ఇటీవల పోలీసు అధికారులు నిర్వహిస్తున్న 'పరివర్తన' 'వారధి' వంటి సదస్సులు కొంత వరకు ఫలితాలనిస్తున్నాయి. గత రెండేళ్ల కంటే సారా కేసులు 50 శాతం తగ్గాయనే చెప్పవచ్చు.

ఆటకట్టిస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలోని మెట్ట, ఏజెన్సీ గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు, రవాణా సాగిపోతోంది. అప్పనపాలెం, జడ్డంగి అన్నవరం, పెదశంకర్లపూడి, ఉత్తరకంచి, కృష్ణవరం వంటి మైదాన ప్రాంతాల్లోనే కాకుండా ఉప ప్రణాళికా ప్రాంతంలో సారా తయారీ యథేచ్ఛగా సాగిపోతోంది. ఇక్కడ తయారైన సారాను కాకినాడ, తుని, పిఠాపురం తదితర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు కాపు కాసి రవాణాదారుల ఆటకట్టింస్తున్నారు. ఇందుకు వలంటీర్లు కూడా సహకరిస్తూ, సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని పనిచేస్తున్నారు.

సిబ్బంది కొరత ఉన్నప్పటికీ..

సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ప్రత్తిపాడు ఎస్ఈబీ పరిధిలోని పలు గ్రామాల్లో, తండాల్లో నిత్యం అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ప్రత్తిపాడు ఎస్ఈబీకి ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ళు, నలుగురు కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అరకొరగా ఉన్న సిబ్బందితో పాటు జిల్లా టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్సీ వింగ్ తదితర సిబ్బంది సారా తయారీ స్థావరాలపై దాడులు చేస్తూ, సారా డ్రమ్ములను, కుండలను, సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్నారు. గ్రామాల్లోనూ, విద్యాలయాల్లోనూ సారా, గంజాయి వంటి మదకద్రవ్యాల వినియోగం వల్ల ఉత్పన్నమయే పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ, ×పరివర్తన₹ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మూడేళ్లలో నమోదైన కేసులు, పట్టుబడిన నిందితుల వివరాలు

సంవత్సరం	నమోదైన కేసులు	అరెస్టు చేసిన నిందితులు	స్వాధీనం చేసుకున్న సారా లీటర్లు	ధ్వంసం చేసిన ఊట లీటర్లు	పట్టుబడిన నల్లబెల్లం కేజీలు	పట్టుబడిన వాహనాలు
2021	1,661	908	17,182	22,07,600	300	95
2022	1,195	947	12,136	10,54,240	22,500	35
2023	593	679	3,021	37,740	530	27
మొత్తం	3,449	2,534	32,339	32,99,580	23,330	157

పరివర్తనతో సత్ఫలితాలు



పరివర్తన కార్యక్రమంలో భాగంగా సారా రహిత సమాజం కోసం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. 2021 నుంచి నేటి వరకు 268 పరివర్తన సదస్సులు నిర్వహించాం. పరివర్తన ఫలితాలను ఇస్తోంది. సారా స్థావరాలపై దాడులు చేసి, సారా తయారీకి పనికొచ్చే బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్నాం. కేసులు నమోదు చేయడమే కాకుండా బైండోవర్ చేస్తున్నాం. ముగ్గురిపై పీడీ యాక్టు అమలు చేశాం. సిబ్బంది కొరత ఉన్నా సారాను సమర్థవంతంగా అరికట్టేందుకు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో సారా తయారు చేస్తున్నట్టు కానీ, రవాణా అవుతున్నట్టు కానీ సమాచారం వచ్చిన వెంటనే దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేస్తున్నాం. సారా అక్రమ రవాణా, తయారీ, విక్రయాలపై తనకు 99518 73261కు సమాచారం అందించి, సహకరించాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– పి.అశోక్, ఎస్ఈబీ సీఐ, ప్రత్తిపాడు